www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 90 | బుధవారం | 11 నవంబర్, 2026



సోనియా ఆత్మకథపై రాజకీయ రగడ!

- లబ్ధికి యత్నిస్తున్నారన్న గిరిరాజ్ సింగ్
- పాత రాజకీయ పరిణామాలపై మళ్లీ చర్చ

2



వేడుకగా గోవర్ధన పూజ

గోవర్ధన పూజను పురస్కరించుకొని ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని సుజావన్ మహదేవ్ ఆలయానికి మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా యమునా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం పూజలో పాల్గొని వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీపావళి మరునటి రోజు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో గోవర్ధన పూజ ఒకటి. హిందూ పురాణాల ప్రకారం.. ద్వాపర యుగంలో బృందావన ప్రజలు వర్షాలు కురిపించాలని ఇంద్రుడిని పూజించేవారు. అయితే ప్రకృతి, పశుసంపదను గౌరవించాలని శ్రీకృష్ణుడు వారికి సూచించాడు. దీంతో ఆగ్రహించిన ఇంద్రుడు గోకులంపై భారీ వర్షాలు కురిపించగా.. ప్రజలను, పశువులను రక్షించేందుకు శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని తన చిటికెన వేలిపై ఎత్తి ఏడు రోజుల పాటు ఆశ్రయం కల్పించినట్లు పురాణగాథ చెబుతోంది. చివరకు ఇంద్రుడు తన అహంకారాన్ని విడిచిపెట్టి కృష్ణుడి గొప్పతనాన్ని అంగీకరించాడని ప్రతీతి. ఈ ఘటనకు గుర్తుగా గోవర్ధన పూజ నిర్వహించే సంప్రదాయం ఏర్పడింది. ఈ పర్వదినాన్ని అన్నకూట్ అని కూడా పిలుస్తారు.



2

మనసులో పెద్ద యుద్ధం!

- 2004లో ప్రధాని పదవి చేపట్టకూడదని ముందే నిర్ణయించుకున్నా
- పిల్లల ఆందోళన.. రాజీవ్ గుర్తుకొచ్చి భావోద్వేగం
- మన్మోహన్ తటస్థ వ్యక్తి.. అందుకే ప్రధాని అభ్యర్థిగా ఎంపిక చేశాం
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ప్రస్తావనలో సోనియా గాంధీ


ప్రధాని పదవి చేపట్టాలా? వద్దా? 2004 సార్వత్రిక ఎన్నికల తర్వాత తన ముందు నిలిచిన ఈ ప్రశ్నపై అంతర్మథనం చెందానని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ వెల్లడించారు. పదవి వద్దని మనసు చెబుతుంటే.. బాధ్యతల నుంచి తప్పుకుంటే ఎదురయ్యే పరిణామాలపై మెదడు హెచ్చరించిందని, ఆ సంఘర్షణలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి తనలో తానే యుద్ధం చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' మంగళవారం విడుదలైంది. ఇందులో కుటుంబ జీవితంలోని సంఘటనలతో పాటు రాజకీయ ప్రయాణంలోని కీలక ఘట్టాలను ప్రస్తావించారు. 2004లో ప్రధాని పదవిని తిరస్కరించడం, మన్మోహన్ సింగ్‌ను ఆ పదవికి ఎంపిక చేయడం వెనుక కారణాలను వివరించారు.

తోడి కోడళ్లు.. రాజకీయ ప్రత్యర్థులు



సోనియా–మేనక వైరం ఎక్కడ.. ఎలా మొదలైంది?

- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో సంచలన విషయాలు
- సంజయ్–మేనక ప్రేమ వివాహంతో మొదలైన కొత్త బంధం
- ఆ తర్వాత కుటుంబంలోనూ కలహాలు
- ఇందిరాగాంధీతో విభేదాలు.. రాజీవ్‌తోనూ దూరం
- సంజయ్ మరణం తర్వాత మారిన కుటుంబ సమీకరణాలు
- ఇంటి నుంచి మేనక నిష్క్రమణపై సోనియా ఆత్మకథలో ఆసక్తికర విషయాలు



ఒకే కుటుంబంలో కోడళ్లుగా అడుగుపెట్టిన ఇద్దరు.. ఆ తర్వాత రాజకీయ ప్రత్యర్థులుగా మారారు. ఒకరు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కాగా, మరొకరు మేనకా గాంధీ. వీరిద్దరి మధ్య విభేదాలు ఎలా మొదలయ్యాయి? కుటుంబంలో చోటుచేసుకున్న పరిణామాలు రాజకీయ వైరం వరకు ఎలా వెళ్లాయి? ఈ ఆసక్తికర అంశాలను సోనియా గాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో వివరించారు. సంజయ్ గాంధీతో మేనక ప్రేమ వివాహం, ఇందిరాగాంధీతో ఆమెకు ఏర్పడిన విభేదాలు, సంజయ్ మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, చివరకు ఇందిర నివాసం నుంచి మేనక వెళ్లిపోవడం వంటి అంశాలను పుస్తకంలో ప్రస్తావించారు.

2



మనసులో పెద్ద యుద్ధం!


న్యూఢిల్లీ: ప్రధాని పదవి చేపట్టాలా? వద్దా? 2004 సార్వత్రిక ఎన్నికల తర్వాత తన ముందు నిలిచిన ఈ ప్రశ్నపై అంతర్మథనం చెందానని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ వెల్లడించారు. పదవి వద్దని మనసు చెబుతుంటే.. బాధ్యతల నుంచి తప్పుకుంటే ఎదురయ్యే పరిణామాలపై మెదడు హెచ్చరించిందని, ఆ సంఘర్షణలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి తనలో తానే యుద్ధం చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' మంగళవారం విడుదలైంది. ఇందులో కుటుంబ జీవితంలోని సంఘటనలతో పాటు రాజకీయ ప్రయాణంలోని కీలక ఘట్టాలను ప్రస్తావించారు. 2004లో ప్రధాని పదవిని తిరస్కరించడం, మన్మోహన్ సింగ్‌ను ఆ పదవికి ఎంపిక చేయడం వెనుక కారణాలను వివరించారు.

పదవి వద్దని ముందే నిర్ణయించుకున్నా..

2004 ఎన్నికలకు కొన్ని నెలల ముందే ప్రధాని పదవి చేపట్టకూడదని నిర్ణయించుకున్నట్లు సోనియా తెలిపారు. ఈ విషయాన్ని తన పిల్లలు రాహుల్, ప్రియాంకలకు కూడా చెప్పానన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హత్యలను చూసిన తర్వాత.. తాను ప్రధాని కావడం కుటుంబానికి ప్రమాదకరమని వారు భావించారని పేర్కొన్నారు. అయితే, ఎన్నికల సమయంలో పార్టీ ఐక్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతో తన నిర్ణయాన్ని బహిరంగంగా వెల్లడించలేదన్నారు. నాయకత్వంపై చర్చలు మొదలైతే ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడుతుందని భావించినట్లు వివరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైనప్పుడు ప్రధాని పదవిని చేపట్టాలనే ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించానని సోనియా చెప్పారు. అదే సమయంలో తన నిర్ణయం పార్టీ నేతలను ఎంతగా నిరాశ పరుస్తుందో కూడా తెలుసన్నారు. యూపీఏ కూటమి నేతలు తన నివాసంలో సమావేశమైన మరుసటి రోజు.. దాదాపు గంటపాటు చర్చించిన తర్వాత పదవి చేపట్టలేనని స్పష్టం చేసినట్లు తెలిపారు. అయితే, నేతలు తన నిర్ణయాన్ని అంగీకరించకుండా ఒత్తిడి చేశారని, చివరకు వారి పట్టుదలతో అంగీకరించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఆ సమయంలో గది బయట ఉన్న ప్రియాంక తన సమాధానం విని వెంటనే రాహుల్‌కు చెప్పిందని, సమావేశం ముగిసిన తర్వాత ఇద్దరూ తన వద్దకు వచ్చి నిర్ణయం మార్చుకోవాలని కోరారని సోనియా గుర్తుచేసుకున్నారు.

ఆ రాత్రంతా సంఘర్షణ

ప్రియాంక కళ్లు ఎర్రబడ టం ఇప్పటికీ గుర్తుందని రాశారు. ఆ రాత్రంతా తనలో సంఘర్షణ జరిగిందని, ఆ సమయంలో రాజీవ్ తన పక్కన ఉంటే బాగుండేదని అనిపించిందని పేర్కొన్నారు. తన విదేశీ మూలాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులు వివాదం సృష్టించే అవకాశం ఉందని, తాను ప్రేమించే దేశానికి అలాంటి పరిస్థితి మంచిది కాదని మనసు ప్రశ్నించిందన్నారు. మరోవైపు, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేసి బాధ్యతల నుంచి తప్పుకోవడం సరికాదని మెదడు హెచ్చరించిందని వివరించారు. చివరకు మనసు చెప్పినట్లే నడుచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.





సోనియా ఆత్మకథపై రాజకీయ రగడ

- రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారన్న గిరిరాజ్ సింగ్
- ప్రణబ్ ప్రధాని పదవిని ఆశించడంలో తప్పేముంది?
- పుస్తకంలోని వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు
- పాత రాజకీయ పరిణామాలపై మళ్లీ చర్చ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రచించిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' విడుదలతో జాతీయ రాజకీయాల్లో మరోసారి వాదోపవాదాలు మొదలయ్యాయి. పుస్తకంలో ఆమె ప్రస్తావించిన పలు అంశాలపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్ర విమర్శలు చేయగా, దివంగత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. సోనియా వ్యాఖ్యలను ప్రశ్నిస్తూ ఇరువురూ వేర్వేరు అంశాలపై స్పందించారు.

బాధితురాలిగా చెప్పుకుంటున్నారు

సోనియా గాంధీ తనను తాను బాధితురాలిగా చిత్రీకరించుకుంటూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. ఆమె పుస్తకంలో చేసిన వ్యాఖ్యలన్నీ అసత్య వాదనలని విమర్శించారు. 'గోరు గిల్లుకుని అమరవీరురాలిగా మారాలని చూస్తున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. నాటి రాజకీయ పరిస్థితుల్లో సోనియా ప్రధాని అయ్యే అవకాశమే లేదని, సరైన సలహా అందడంతోనే ఆ పదవిని చేపట్టకుండా వెనక్కి తగ్గారని అన్నారు. ఈ పుస్తకం ద్వారా ఆమె అసలు నైజం బయటపడిందని విమర్శించారు. బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది మరణించినప్పుడు సోనియా కన్నీరు పెట్టుకున్నారని ఆరోపించిన గిరిరాజ్ సింగ్.. గోద్రా ఘటనలో హిందువులు సజీవదహనమైనప్పుడు, పహల్గాంలో ఉగ్రవాదులు పౌరులను హతమార్చినప్పుడు ఆమె ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 1983లో అధికారం కోసమే ఆమె భారత పౌరసత్వం తీసుకున్నారని కూడా ఆరోపించారు.

ప్రణబ్ ప్రధాని కావాలనుకోవడంలో తప్పేముంది?

మరోవైపు, దివంగత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ.. సోనియా ఆత్మకథలో తన తండ్రి గురించి చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 2010లో అప్పటి ఆర్థిక మంత్రి పి.చిదంబరంతో విభేదాలు తలెత్తిన సమయంలో నాయకత్వ మార్పు గురించి ప్రణబ్ ప్రస్తావించారని, ఆ మాటలు తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయని సోనియా పుస్తకంలో పేర్కొన్నారు. దీనిపై శర్మిష్ఠ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు.దశాబ్దాల రాజకీయ అనుభవం, అపారమైన పాలనా దక్షత, కఠోర శ్రమతో ఎదిగిన నాయకుడు ప్రధాని పదవిని ఆశించడంలో ఆశ్చర్యం ఏముందని ఆమె ప్రశ్నించారు. అర్హత ఉన్న వ్యక్తి ఆ పదవిని కోరుకోవడం తప్పా? నెహ్రూ కుటుంబానికి చెందని వ్యక్తి అలాంటి ఆకాంక్ష కలిగి ఉండటమే సోనియాకు దిగ్భ్రాంతి కలిగించిందా? అని నిలదీశారు. తన తండ్రికి వారసత్వంగా ఏ పదవీ లభించలేదని, స్వశక్తితోనే ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. సోనియా ఆత్మకథలోని వ్యాఖ్యలతో గతంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. పుస్తకంలోని అంశాలపై రాజకీయ నేతలు, సంబంధిత కుటుంబ సభ్యుల నుంచి భిన్నమైన స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

ఎమర్జెన్సీని సమర్థించే యత్నం!

- సోనియా ఆత్మకథకు 'వైట్‌వాషింగ్' అని పేరు పెట్టాల్సింది
- నెహ్రూ–గాంధీ కుటుంబ తప్పిదాలను కప్పిపుచ్చే ప్రయత్నం
- 1984 సిక్కుల ఊచకోత, 26/11 దాడులపై ఎందుకు మౌనం?: బీజేపీ

న్యూఢిల్లీ: మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన ఆత్మకథలో ఎమర్జెన్సీని సమర్థించే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ విమర్శించింది. ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకానికి 'వైట్‌వాషింగ్' (తప్పిదాలను కప్పిపుచ్చడం) అని పేరు పెట్టాల్సిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఎద్దేవా చేశారు. నెహ్రూ–గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలకు ముసుగు వేయడమే పుస్తకం ఉద్దేశంగా కనిపిస్తోందని ఎక్స్ వేదికగా విమర్శించారు. సోనియా గాంధీ ఆత్మకథ మంగళవారం విడుదలైంది. 1975లో దేశంలో విధించిన ఎమర్జెన్సీని ఒక తప్పిదంగా ఆమె పేర్కొన్నారు. తన అత్త, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కూడా ఆ తర్వాత అదే అభిప్రాయానికి వచ్చి ఉంటారని భావిస్తున్నట్లు రాశారు. తన భర్త రాజీవ్ గాంధీ సోదరుడు సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే.. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన పరిణామాల్లో చాలా వరకు నష్టాన్ని నివారించగలిగేవారమని అభిప్రాయపడ్డారు.

1984 ఊచకోతపై ఎందుకు కన్నీరు పెట్టలేదు?

సోనియా గాంధీ బాబ్రీ మసీదు ఘటనపై కన్నీరు పెట్టుకున్నానని చెప్పారని కేశవన్ పేర్కొన్నారు. 1984లో కాంగ్రెస్ పాలనలో సిక్కులపై జరిగిన హింసలో వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయినప్పుడు ఆమె ఒక్క కన్నీటి బొట్టు అయినా రాల్చారా? అని ప్రశ్నించారు. బాట్లా హౌస్ ఘటనలో ఉగ్రవాదుల కోసం కన్నీరు పెట్టుకున్న సోనియా.. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన సీఆర్‌పీఎఫ్ జవాన్ల కోసం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన 26/11 ముంబయి ఉగ్రదాడుల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోయినప్పుడు ఎందుకు బాధపడలేదని, దాడులకు ప్రతీకారం తీర్చుకోవడంలో అప్పటి ప్రభుత్వం ఎందుకు విఫలమైందని ప్రశ్నించారు.

రాజ్యాంగ హక్కులను నిలిపివేశారు

రాజ్యాంగాన్ని, ప్రాథమిక హక్కులను నిలిపివేసిన ఎమర్జెన్సీని సమర్థిస్తూ, సాధారణ పరిణామంగా చూపేందుకు సోనియా ప్రయత్నించడం విస్మయకరమని కేశవన్ విమర్శించారు. కేంద్రంలో దాదాపు 55 ఏళ్ల కాంగ్రెస్ పాలన దేశ రాజకీయ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం కలిగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేసిన చారిత్రక తప్పిదాలను సరిదిద్దుతున్న ప్రధాని మోదీకి దేశం కృతజ్ఞతలు తెలుపుతోందని పేర్కొన్నారు.



యమునాలో నురుగు తొలగింపునకు చర్యలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని కాలింది కుంజ్ సమీపంలో యమునా నదిపై పేరుకుపోయిన విషపూరిత నురుగును తొలగించేందుకు పడవపై నుంచి రసాయన ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న సిబ్బంది. మంగళవారం నదిలో నురుగు నివారణ చర్యలు చేపట్టారు. ఢిల్లీ గుండా ప్రవహించే యమునా నది తీవ్ర కాలుష్య సమస్యను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా కాలింది కుంజ్, ఓఖ్లా బ్యారేజీ పరిసరాల్లో నదిపై తెల్లటి విషపూరిత నురుగు భారీగా పేరుకుపోతోంది. నదిలోకి శుద్ధి చేయని మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, డిటర్జెంట్లతో కూడిన రసాయనాలు చేరడం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ వ్యర్థాల్లో ఉండే సర్ఫాక్టెంట్లు నీటిలో కలిసినప్పుడు గాలి బుడగలను బంధించి తెల్లటి నురుగుగా మారుస్తాయి. బ్యారేజీల వద్ద ఎత్తు నుంచి నీరు కిందకు పడటంతో ఏర్పడే అలజడి నురుగు మరింతగా పెరిగేందుకు కారణమవుతోంది. చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల ఈ నురుగు ఎక్కువసేపు నీటిపై నిలిచి ఉంటోంది. ఈ సమస్యను తాత్కాలికంగా నియంత్రించేందుకు ఢిల్లీ జల్ బోర్డు, సంబంధిత అధికారులు పడవల ద్వారా నదిపై నురుగు నివారణ రసాయనాలను పిచికారీ చేస్తున్నారు. నీటిపై పేరుకుపోయిన నురుగును తగ్గించేందుకు ప్రత్యేక ద్రావణాలను ఉపయోగిస్తున్నారు. అయితే ఈ చర్యలు నురుగు తీవ్రతను మాత్రమే తగ్గిస్తాయని, నదిలోని అసలు కాలుష్యాన్ని తొలగించలేవని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల పనితీరును మెరుగుపరచడం, పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలవకుండా అడ్డుకోవడం, నదిలోకి స్వచ్ఛమైన నీటి ప్రవాహాన్ని పెంచడం ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమని సూచిస్తున్నారు.

డిజిటల్ అరెస్టు మోసాలకు అడ్డుకట్ట వేయండి

- వాట్సాప్ సహా సోషల్ మీడియా వేదికలకు సుప్రీంకోర్టు ఆదేశం
- మోసాల నివారణకు తీసుకునే చర్యలపై ప్రతిపాదనలు సమర్పించాలని సూచన
- బాధితులకు పరిహారం చెల్లించేలా బ్యాంకులకు నిబంధనలు ఉండాలని స్పష్టం



న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్టు మోసాలు, ఇతర సైబర్ నేరాల నివారణకు తీసుకోబోయే చర్యలపై ప్రతిపాదనలు సమర్పించాలని వాట్సాప్ సహా ఇతర డిజిటల్ వేదికలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ప్రతిపాదనలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)కు కూడా ఏకకాలంలో అందజేయాలని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన కూడా సభ్యులుగా ఉన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. వాట్సాప్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్.. డిజిటల్ మోసాల నివారణకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టినట్లు కోర్టుకు తెలిపారు. ఇందులో భాగంగా 9,400 ఖాతాలపై చర్యలు తీసుకున్నామని, అనుమానాస్పద ఖాతాలను గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేసే సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై అఫిడవిట్ దాఖలు చేస్తామని వెల్లడించారు.

మోసాలకు బ్యాంకులదే బాధ్యత

డిజిటల్ అరెస్టు మోసాలు, ఇతర సైబర్ నేరాల్లో బాధితులు నష్టపోయిన సొమ్మును తిరిగి చెల్లించే బాధ్యత బ్యాంకులపై కూడా ఉండాలని సుప్రీంకోర్టు గత విచారణలో స్పష్టం చేసింది. బ్యాంకులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మోసం జరిగినట్లు దర్యాప్తులో తేలితే.. బాధితులకు నష్టపరిహారం చెల్లించేలా ఆర్బీఐ నిబంధనలు రూపొందించాలని సూచించింది. కస్టమర్ కోల్పోయిన మొత్తానికి తగ్గకుండా పరిహారం చెల్లించే నిబంధనలు ఉండాలని పేర్కొంది. ఖాతాదారుల సాధారణ లావాదేవీల తీరుకు భిన్నంగా భారీ మొత్తంలో నగదు బదిలీకి ప్రయత్నించినప్పుడు బ్యాంకులు ఎందుకు జోక్యం చేసుకోలేకపోతున్నాయని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. అనుమానాస్పద లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం, అనంతరం సంబంధిత లావాదేవీలపై ప్రత్యక్షంగా విచారణ జరిపి నిజానిజాలు నిర్ధారించడం వంటి రక్షణ చర్యలు తప్పనిసరి చేయాలని ధర్మాసనం సూచించింది.

ఆర్బీఐకి కీలక ఆదేశాలు

ఆర్బీఐ ప్రతిపాదించిన నియంత్రణ చర్యల అమలును పర్యవేక్షించేందుకు దేశంలోని అన్ని అధీకృత ఆర్థిక సంస్థల జాబితాను తదుపరి విచారణ నాటికి సమర్పించాలని ఆర్బీఐని ఆదేశించింది. సైబర్ నేరాలు 50 శాతం తగ్గినప్పటికీ, ఈ ఏడాది ఇప్పటివరకు బాధితులు రూ.800 కోట్లు నష్టపోయారని ధర్మాసనం పేర్కొంది. పరిహారం, ముందస్తు నివారణ చర్యలు, సంస్థల జవాబుదారీతనానికి సంబంధించి అమలు చేయగల నిబంధనలు ఆర్బీఐ రూపొందించే విధానంలో ఉండాలని స్పష్టం చేసింది. ఆర్బీఐ ప్రతిపాదించిన కేవైసీ సవరణ మార్గదర్శకాలు–2026ను ముందుగా పరిశీలించిన తర్వాతే నియంత్రణ ప్రక్రియకు అనుమతిస్తామని తెలిపింది. ఈ మార్గదర్శకాలను నవంబర్ 30లోగా ప్రకటించి, డిసెంబర్ 31నాటికి అమల్లోకి తేవాలని ప్రతిపాదించారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకూ సూచనలు

డిజిటల్ అరెస్టు మోసాలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లు, వాటిపై చేపట్టిన దర్యాప్తు వివరాలతో నివేదికలు సమర్పించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు విభాగాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇలాంటి నేరాల నివారణ, గుర్తింపు, నిందితులపై విచారణకు సంబంధించి సూచనలు కూడా ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు నివేదికలు సమర్పించేలా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల డీజీపీలు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ స్పందనను సమన్వయం చేస్తున్న అంతర్‌శాఖ కమిటీకి నివేదికలు అందించాలని, కోర్టుకు సమర్పించే నివేదికల ప్రతులను కూడా ఆ కమిటీకి పంపాలని ఆదేశించింది.

తోడి కోడళ్లు.. రాజకీయ ప్రత్యర్థులు



న్యూఢిల్లీ: ఒకే కుటుంబంలో కోడళ్లుగా అడుగుపెట్టిన ఇద్దరు.. ఆ తర్వాత రాజకీయ ప్రత్యర్థులుగా మారారు. ఒకరు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కాగా, మరొకరు మేనకా గాంధీ. వీరిద్దరి మధ్య విభేదాలు ఎలా మొదలయ్యాయి? కుటుంబంలో చోటుచేసుకున్న పరిణామాలు రాజకీయ వైరం వరకు ఎలా వెళ్లాయి? ఈ ఆసక్తికర అంశాలను సోనియా గాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో వివరించారు. సంజయ్ గాంధీతో మేనక ప్రేమ వివాహం, ఇందిరాగాంధీతో ఆమెకు ఏర్పడిన విభేదాలు, సంజయ్ మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, చివరకు ఇందిర నివాసం నుంచి మేనక వెళ్లిపోవడం వంటి అంశాలను పుస్తకంలో ప్రస్తావించారు.

ప్రేమ వివాహంతో మొదలైన పరిచయం

1973 చివర్లో సంజయ్ గాంధీకి మేనక పరిచయమయ్యారని సోనియా తన పుస్తకంలో పేర్కొన్నారు. అప్పటికి మేనక వయసు 18 ఏళ్ల లోపే. సంజయ్ కంటే పదేళ్లు చిన్నదైన ఆమె ఎంతో ఉత్సాహంగా, చలాకీగా ఉండేవారని రాశారు. పరిచయమైన ఏడాదిలోపే ఇద్దరూ వివాహం చేసుకున్నారని తెలిపారు. కుటుంబంలోకి కొత్తగా వచ్చిన మేనకను తొలుత ఆప్యాయంగా స్వాగతించామని, అయితే కొంతకాలానికే విభేదాలు మొదలయ్యాయని వివరించారు. ఇంటి సిబ్బంది తనను 'బహురాణి' అని పిలిచేవారని, ఇద్దరినీ సమానంగా చూసేవారని పేర్కొన్నారు. కానీ మేనక ఈ వ్యవహారాన్ని మరోలా అర్థం చేసుకుని ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఆమె దురుసుగా మాట్లాడిన సందర్భాల్లో కుటుంబంలో ప్రశాంతత కోసం తాను మౌనంగా ఉండేదాన్నని, హద్దు దాటితే మాత్రం గట్టిగానే సమాధానమిచ్చేదాన్నని సోనియా గుర్తుచేసుకున్నారు.

ఇందిరతోనూ పెరిగిన విభేదాలు

కాలక్రమేణా సంజయ్, మేనక మధ్య విభేదాలు పెరిగాయని సోనియా తెలిపారు. ఇద్దరి మధ్య వాగ్వాదాలు తరచూ జరిగేవని, మేనక కోపంలో అసభ్య పదజాలం ఉపయోగించడం సంజయ్‌ను ఇబ్బందికి గురిచేసేదని రాశారు. రాజకీయ కార్యక్రమాల్లో సంజయ్‌తో కలిసి పాల్గొనడం ప్రారంభించిన తర్వాత ఆమె కుటుంబ వాతావరణానికి అలవాటుపడినట్లు కనిపించేవారని పేర్కొన్నారు. మరోవైపు మేనక ప్రభావం సంజయ్‌పై పెరగడంతో ఆయనకు, రాజీవ్ గాంధీకి మధ్య దూరం పెరిగిందని వివరించారు. గతంలో ఎంతో సన్నిహితంగా ఉండే సోదరుల మధ్య విభేదాలు తలెత్తాయని చెప్పారు. ఎమర్జెన్సీ అనంతర పరిణామాలు, రాజకీయంగా సంజయ్ వ్యవహరించిన తీరు ఇందిరాగాంధీకి అసంతృప్తి కలిగించాయని సోనియా పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని కొన్ని వర్గాలు సంజయ్ రాజకీయ ఆశయాలకు మద్దతు ఇవ్వడం కూడా ఇందిరకు నచ్చలేదని తెలిపారు. మేనక ఆయనకు నచ్చజెప్పాల్సింది పోయి మరింత ప్రోత్సహిస్తున్నారని ఇందిర భావించేవారని రాశారు. ఈ నేపథ్యంలో తన చిన్న కోడలిని ఉద్దేశించి అప్పటి కేబినెట్ కార్యదర్శి పీఎన్ ధర్‌తో ఇందిర 'ఉస్కే అభీ సే పర్ నికలేంగే' (ఆమెకు అప్పుడే రెక్కలు వస్తున్నాయి) అన్నట్లు సోనియా వెల్లడించారు.

ఎన్నికల ఓటమితో మరింత అగాధం

1978 ఎన్నికల్లో ఇందిరాగాంధీ పరాజయానికి సంజయ్ వైఖరి కూడా ఒక కారణమని రాజీవ్ భావించేవారని సోనియా రాశారు. సంజయ్ తొందరపాటు నిర్ణయాలు, మొండితనం, తల్లి సలహాలను పట్టించుకోకపోవడం ఇందిరకు రాజకీయంగా నష్టం కలిగించాయని రాజీవ్ అభిప్రాయపడినట్లు తెలిపారు. కుటుంబ సమావేశంలో 'అమ్మను ఈ పరిస్థితికి తీసుకొచ్చావు.. నిన్ను క్షమించలేను సంజయ్' అంటూ రాజీవ్ ఆగ్రహం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఇందిర కూడా రాజీవ్ అభిప్రాయంతో ఏకీభవించారని పేర్కొన్నారు. ఈ సమయంలో మేనక జోక్యం చేసుకోవడంతో ఇందిర ఆమెపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారని వివరించారు. మేనక తమను ప్రత్యర్థులుగా భావించేవారని, తనకు పరిచయమున్న జర్నలిస్టుల ద్వారా తమకు వ్యతిరేకంగా కథనాలు రాయించేవారని సోనియా ఆరోపించారు.

సంజయ్ మరణంతో మారిన పరిస్థితులు

1980 జూన్ 23న విమాన ప్రమాదంలో సంజయ్ గాంధీ మరణించడంతో కుటుంబంలో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారాయని సోనియా తెలిపారు. సంజయ్ రాజకీయ వారసత్వాన్ని మేనకకు అప్పగించాలని ఆయన అనుచరులు కోరేలా ఆమె తల్లి ప్రోత్సహించారని అప్పట్లో భావించేవారని పేర్కొన్నారు. అయితే మేనకకు అప్పటికి 23 ఏళ్లే కావడం, మూడు నెలల పసిబిడ్డ ఉండటంతో రాజకీయ బాధ్యతలు చేపట్టేందుకు ఆమె ఇంకా సిద్ధంగా లేరని ఇందిర భావించారని రాశారు. తొందరపడకుండా సమయం కోసం ఎదురుచూడాలని సూచించినట్లు వివరించారు.

వరుణ్ తొలి పుట్టినరోజుతో దూరం

సంజయ్ మరణించిన ఏడాది కూడా గడవకముందే మేనక కుటుంబానికి దూరమవుతున్న సంకేతాలు కనిపించాయని సోనియా పేర్కొన్నారు. మనవడు ఫిరోజ్ వరుణ్ గాంధీ తొలి పుట్టినరోజును ఇంట్లోనే నిర్వహించాలని ఇందిర భావించగా, ఆ వేడుక వసుంధర రాజే ఇంట్లో జరిగినట్లు తర్వాత తెలిసిందని రాశారు. వసుంధర రాజేకు ఇందిరతో రాజకీయ విభేదాలు ఉండటంతో ఈ పరిణామం ఆమెను అసంతృప్తికి గురిచేసిందని వివరించారు. అంతేకాకుండా మేనక తన ఆధ్వర్యంలోని 'సూర్య' పత్రికను ఆర్ఎస్ఎస్ సభ్యుడికి విక్రయించడం కూడా ఇందిరకు ఆగ్రహం కలిగించిందని పేర్కొన్నారు.

ఇంటి నుంచి బయటకు..

ఇందిరాగాంధీ అధికారిక పర్యటన కోసం లండన్‌కు వెళ్లిన సమయంలో మేనక తన వస్తువులను ఇంటి నుంచి తరలిస్తున్నట్లు సమాచారం అందిందని సోనియా వెల్లడించారు. తిరిగి వచ్చిన తర్వాత రాజకీయ కార్యకలాపాల విషయంలో ఇందిర ఆమెను నిలదీశారని, వాటిని ఆపుకోవాలని లేదా ఇంటి నుంచి వెళ్లిపోవాలని స్పష్టం చేశారని రాశారు. దీనిపై మేనక ఆరోపణలతో కూడిన లేఖ రాశారని, ఇంటి నుంచి వెళ్లిపోవడానికి ఇందిరే కారణమన్న భావన కలిగించేలా వ్యవహరించారని సోనియా పేర్కొన్నారు. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయంగానూ పెద్ద చర్చకు దారితీసిందని వివరించారు.

మనవడి కోసం న్యాయపోరాటం

మేనక ఇంటి నుంచి వెళ్లిపోయిన తర్వాత మనవడు వరుణ్‌ను కలుసుకునేందుకు ఇందిర కుటుంబం న్యాయపోరాటం చేయాల్సి వచ్చిందని సోనియా వెల్లడించారు. అయితే మేనక ఇందుకు అంగీకరించలేదని పేర్కొన్నారు. వరుణ్ నాలుగో పుట్టినరోజు సందర్భంగా ఇందిర సూచన మేరకు తాను అతడి నర్సరీ పాఠశాలకు బహుమతులు తీసుకెళ్లనని, మరుసటి రోజు తనపై కిడ్నాప్ ఆరోపణలు చేస్తూ పత్రికల్లో కథనాలు వచ్చాయని గుర్తుచేశారు. 1984 ఏప్రిల్ 19న ఇందిర తరఫు న్యాయవాది మేనక న్యాయవాదికి చివరిసారిగా సమాధానం ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత రెండు నెలలకే ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్య చోటు చేసుకుందని ప్రస్తావించారు.

రాజకీయ ప్రత్యర్థులుగా..

కుటుంబ విభేదాలు చివరకు రాజకీయ పోరుగా మారాయి. 1984 లోక్‌సభ ఎన్నికల్లో మేనక స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రాజీవ్ గాంధీ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 1988లో వీపీ సింగ్ నేతృత్వంలోని జనతాదళ్‌లో చేరారు. 2004లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో అధికారికంగా చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. ఇలా ఒకే కుటుంబంలో కోడళ్లుగా కలిసి ఉన్న సోనియా, మేనక మధ్య మొదలైన విభేదాలు కాలక్రమంలో రాజకీయ ప్రత్యర్థిత్వానికి దారితీశాయని ఆత్మకథలో వివరించారు.

యూపీఎస్సీ తరహా టీజీపీఎస్సీ

• గతంలో రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది • కమిషన్‌ను ప్రక్షాళన చేసి అనుభవజ్ఞులను నియమించాం
• గ్రూప్–1 నియామకాలను సుప్రీంకోర్టు సమర్థించింది • ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి.. యువ డీఎస్పీలకు సీఎం రేవంత్ హితవు



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)ను యూపీఎస్సీ తరహాలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గతంలో టీఎస్‌పీఎస్సీ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని, అవగాహన లేని వ్యక్తులను కమిషన్ సభ్యులుగా నియమించడం వల్లే నియామక ప్రక్రియలో గందరగోళం నెలకొందని విమర్శించారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత కమిషన్‌ను ప్రక్షాళన చేసి, అనుభవం, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తులను నియమించామని తెలిపారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో గ్రూప్–1 నియామకాల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో గ్రూప్–1 నియామకాలు జరిగాయని, ఆ తర్వాత దాదాపు 13 ఏళ్ల పాటు నియామక ప్రక్రియ ముందుకు సాగలేదని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణలో గందరగోళం నెలకొందని, అప్పటి నిర్ణయాలు, నిర్లక్ష్యం కారణంగా అభ్యర్థులు నష్టపోయారని విమర్శించారు. 563 గ్రూప్–1 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 562 మంది ఉద్యోగాల్లో చేరారని సీఎం వెల్లడించారు. నియామక ప్రక్రియపై కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టించారని, ప్రభుత్వం చేయని తప్పులను ఆపాదిస్తూ నియామకాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దీనివల్ల అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారని చెప్పారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానాల్లో ప్రభుత్వం సమర్థంగా వాదనలు వినిపించిందని, సుప్రీంకోర్టు సైతం నియామక ప్రక్రియను సమర్థించిందని తెలిపారు.

ప్రజాసేవే అధికారుల లక్ష్యం కావాలి

డీఎస్పీలుగా ఎంపికైన యువ అధికారులు తమ నేపథ్యాన్ని, ఈ స్థాయికి చేరుకోవడానికి పడిన కష్టాన్ని మర్చిపోవద్దని రేవంత్ రెడ్డి సూచించారు. డీఎస్పీగా ఉద్యోగం సాధించడంతో జీవితంలో రెండో అధ్యాయం ప్రారంభమవుతుందని అన్నారు. అధికారాన్ని ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తేనే గౌరవం నిలుస్తుందని, స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే ఆ గౌరవం ఎక్కువ కాలం ఉండదని హితవు పలికారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఓపికగా వినాలని, బాధితుల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ భవిష్యత్తు యువ అధికారుల చేతుల్లోనే ఉందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత వారిపై ఉందని పేర్కొన్నారు.

విధులను నిబద్ధతతో నిర్వహించాలని ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన ట్రైనీ డీఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి పతకాలు అందజేశారు.

రాష్ట్రం గజగజ

• తెలంగాణను వణికిస్తున్న చలి
• 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్
• మరో మూడు రోజులు తీవ్రత అధికం
• ఏడు జిల్లాల్లో 12 డిగ్రీలకు పడిపోనున్న ఉష్ణోగ్రతలు
• పొగమంచుతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతుండటంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా చలిగాలుల ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. జోగులాంబ గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యే అవకాశముంది. సంగారెడ్డి, మెదక్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉండనుంది. ఈ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల వరకు పడిపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండలో 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి తక్కువ ఎత్తులో వీస్తున్న చల్లని గాలుల ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న మూడు రోజులు తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో రహదారులపై దృశ్యమానత తగ్గే ప్రమాదం ఉందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

సేవే మానవత్వానికి అసలైన ప్రతిరూపం

• అమ్మ జీవితం సమాజానికి ఆదర్శం
• విద్య, వైద్యం, సేవా రంగాల్లో మఠం కృషి అభినందనీయం
• రజతోత్సవ వేడుకల్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా



ప్రజానావ, హైదరాబాద్: ప్రేమ, కరుణ, నిస్వార్థ సేవలకు ప్రతిరూపంగా మాతా అమృతానందమయి (అమ్మ) జీవితం సమాజానికి ఆదర్శమని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. మానవ సేవను మించిన గొప్ప కార్యం మరొకటి లేదని పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఈస్ట్ మారేడుపల్లిలో మంగళవారం నిర్వహించిన మాతా అమృతానందమయి మఠం, అమృత విద్యాలయం రజతోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా మఠం విద్య, వైద్యం, సేవా రంగాల్లో విశేష కృషి చేస్తోందని ప్రశంసించారు. నమామి గంగే, స్వచ్ఛభారత్ కార్యక్రమాలకు మఠం రూ.100 కోట్లు విరాళంగా అందించిందని గుర్తుచేశారు. ఐదు దశాబ్దాల్లో దాదాపు నాలుగు కోట్ల మందికి ప్రేమాభిమానాలు పంచిన అమ్మ.. ప్రపంచానికి శాంతి, ఐక్యత సందేశాన్ని అందిస్తున్నారని కొనియాడారు. పేదలకు వైద్యం, విపత్తుల సమయంలో సహాయం, గ్రామాల దత్తత, నిరుపేదలకు పింఛన్లు, వస్త్రాల పంపిణీ వంటి కార్యక్రమాలు మఠం సేవాభావానికి నిదర్శనమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, కరుణ, సామాజిక బాధ్యత, దేశసేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మఠం దత్తత తీసుకున్న గ్రామాలకు చెందిన మహిళలకు అమ్మ, గవర్నర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చీరలు, చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గవర్నర్ సతీమణి జానకి శుక్లా, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఎం. కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

సమగ్ర రీ సర్వేలో పారదర్శకత, కచ్చితత్వానికి పెద్దపీట వేయాలి

• భూ యజమానుల అభిప్రాయాలు, అభ్యంతరాలకు ప్రాధాన్యం • 2,720 గ్రామాల్లో సర్వే.. ఇప్పటికే వెయ్యి గ్రామాల్లో కీలక దశకు
• సర్వే పూర్తయిన గ్రామాల్లో భూదార్ నంబర్ల కేటాయింపును వేగవంతం చేయాలి • అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

ప్రజానావ, హైదరాబాద్: తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, అభిప్రాయాలు, అభ్యంతరాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూ రీసర్వే పురోగతిపై మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల స్పందన, సాంకేతిక అంశాలు, సర్వే సిబ్బంది ఇబ్బందులపై చర్చించారు. సర్వేలో పాల్గొంటున్న సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో సర్వే కీలక దశకు చేరుకోగా, 416 గ్రామాల్లో ప్రక్రియ పూర్తయిందని వివరించారు.



రికార్డుల పరిశీలన తర్వాతే సర్వే

125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో సర్వే ప్రారంభించే ముందు అక్కడి రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. రికార్డుల్లోని వివరాలు, భూముల విస్తీర్ణం, హక్కులు, సరిహద్దులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని ఆదేశించారు. సర్వే పూర్తయ్యాక సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు తగిన అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. భూ యజమానుల నుంచి వచ్చే అభ్యంతరాలు, సూచనలను స్వీకరించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. సర్వే విధానం, నోటీసుల జారీ, అభ్యంతరాల నమోదు, వాటి పరిష్కార ప్రక్రియపై గ్రామస్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఒక్క తప్పిదం ఉండొద్దు

భూ రీసర్వే కేవలం ప్రభుత్వ రికార్డుల నవీకరణకే పరిమితం కాకూడదని, ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించే ప్రక్రియగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. రైతుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను గౌరవిస్తూ వారికి పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించాలన్నారు. ప్రారంభ దశలోనే క్షేత్రస్థాయిలో ఏవైనా పొరపాట్లు, లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. చిన్న తప్పిదం కూడా భవిష్యత్తులో మరో భూ వివాదానికి కారణం కాకూడదని స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ఆధార్ నంబర్ తరహాలో ప్రత్యేక గుర్తింపునిచ్చే భూదార్ నంబర్ల కేటాయింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. భూముల విస్తీర్ణం, హక్కులు, సరిహద్దులకు సంబంధించి స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు ఈ సమగ్ర సర్వే ద్వారా శాశ్వత ముగింపు పలకాలని, భవిష్యత్తు తరాలకు భూ వివాదాలు లేని తెలంగాణను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

కలెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్

భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయి సమస్యలు, సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూ యజమానులకు కల్పించాల్సిన అవకాశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి నిర్ణయించారు. జిల్లా వారీగా పురోగతిని సమీక్షించి, తదుపరి కార్యాచరణపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరా?

• 35ఏళ్లుగా నాన్ టీచింగ్ సిబ్బందికి అన్యాయం • వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు ఇస్తామన్న సీఎం హామీ ఏమైంది?
• ఉద్యోగుల ఆందోళనకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత మద్దతు • ఓపీఎస్ అమలు చేయాలి.. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



ప్రజానావ, హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ సిబ్బంది శ్రమను దోచుకుంటూ, వారి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు స్పందించడం లేదని ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఓయూ పరిపాలనా భవనం ఎదుట నాన్ టీచింగ్ సిబ్బంది చేపట్టిన ఆందోళనకు మంగళవారం ఆమె మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఉస్మానియాలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు 35 ఏళ్లుగా అన్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎదురైన సమస్యలే తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కొనసాగడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగులు, ప్రొఫెసర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్నట్లుగానే ఉద్యోగులు ఆవేదన చెందుతున్న విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందదని వ్యాఖ్యానించారు.

వీసీ వైఖరిపై విమర్శలు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన వైస్ ఛాన్సలర్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కవిత ఆరోపించారు. టైమ్ స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉండగా, వారి సమస్యలను పక్కనపెట్టి కొత్త నియామకాలకు ప్రయత్నించడం సరికాదన్నారు. ముందుగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆందోళన చేస్తున్న సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వీసీపై మండిపడ్డారు. ఉస్మానియాకు 105 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా మాదిగ బిడ్డను వీసీగా నియమించామని ముఖ్యమంత్రి గొప్పగా చెబుతున్నారని, అయితే నిధులు కేటాయించకపోతే వీసీ మాత్రం ఏం చేయగలరని ప్రశ్నించారు. నిధులు ఇవ్వకుండా వీసీని బాధ్యుడిని చేస్తున్నారా? లేక ప్రభుత్వ ప్రయోజనాల కోసం వీసీ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారా? అని నిలదీశారు. విశ్వవిద్యాలయ స్వయంప్రతిపత్తిని కాపాడుతూ ఉద్యోగుల కోసం ప్రభుత్వంతో పోరాడాలని సూచించారు. వర్సిటీ ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వీసీలను చరిత్ర గుర్తుంచుకుంటుందని, ఉద్యోగుల ప్రయోజనాలను పక్కనపెడితే మాత్రం చరిత్ర క్షమించదని హెచ్చరించారు.

స్థానిక నియామకాలపై ప్రశ్నలు

గత ఏడాదిన్నరగా నాన్ టీచింగ్ సిబ్బంది ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని కవిత ప్రశ్నించారు. నాన్ పర్మినెంట్ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలను నిలిపివేస్తూ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఓయూలో 85 శాతం స్థానికులనే నియమించుకోవాల్సి ఉండగా, భద్రతా సిబ్బందిగా బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారిని నియమిస్తున్నారని చెప్పారు. విశ్వవిద్యాలయంలో అవినీతి బయటపడకుండా ఉండేందుకే స్థానికేతరులను నియమిస్తున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలపై వర్సిటీ ఛాన్సలర్‌గా ఉన్న గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.

ఓపీఎస్ అమలు చేయాలి

ఉస్మానియా ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పిన మాటలు ఆచరణలోకి రావడం లేదని కవిత విమర్శించారు. 2001 నుంచి 2004 వరకు నియమితులైన వారికి ఓపీఎస్ వర్తింపజేయాలని, 2004 నుంచి విధుల్లో చేరిన వారికి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఏటా చెల్లించాల్సిన మొత్తాన్ని క్రమం తప్పకుండా చెల్లించాలని, మరణించిన టైమ్ స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల వ్యవస్థను రద్దు చేసి, వారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఈహెచ్ఎస్ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇదే సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు (శీకాంత్ గౌడ్, ఆకాష్‌కు మద్దతు ఇవ్వాలని ఉద్యోగులను కవిత కోరారు.






చేతిలో ఫోన్.. ఆరోగ్యానికి చేటు!

చేతిలో ఫోన్ ఉంటే చాలు.. ఏ పని చేస్తున్నా మధ్యమధ్యలో దానివైపు చూడాల్సిందే! సందేశాలు రాకపోయినా, ఫోన్ మోగకపోయినా.. ఏదో ఒకటి చూడాలన్న ఆరాటం. ఐదు నిమిషాలకోసారి తెరను తెరిచి చూడటం చాలామందికి తెలియకుండానే అలవాటుగా మారిపోయింది. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్నారు. చివరకు భోజనం చేస్తున్నప్పుడు, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నప్పుడు కూడా ఫోన్‌ను పక్కన పెట్టలేకపోతున్నారు. ఈ అలవాటు క్రమంగా వ్యసనంగా మారడమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపుతోంది. కంటిచూపు సమస్యల నుంచి నిద్రలేమి వరకు అనేక ఇబ్బందులకు కారణమవుతోంది. అతిగా ఫోన్ వాడటం వల్ల ఎదురయ్యే అనర్థాలు, వాటిని నివారించుకునే మార్గాలపై ఓసారి దృష్టి సారిద్దాం.

కంటిచూపుపై ప్రతికూల ప్రభావం

చిన్న తెరను ఎక్కువసేపు తదేకంగా చూడటం వల్ల కళ్లపై ఒత్తిడి పెరుగుతుంది. కళ్లు తక్కువగా ఆర్పడం వల్ల పొడిబారడం, మంట, నీళ్లు కారడం వంటి సమస్యలు ఎదురవుతాయి. తలనొప్పి, తాత్కాలికంగా చూపు మసకబారడం కూడా సంభవించవచ్చు. వీటిని నివారించేందుకు తరచూ విరామం తీసుకోవాలి. తెర వెలుగును పరిసరాలకు అనుగుణంగా తగ్గించుకోవాలి. ప్రతి 20 నిమిషాలకోసారి కనీసం 20 అడుగుల దూరంలోని వస్తువును 20 సెకన్లపాటు చూడటం మంచిది.






నిద్రకు దూరం చేస్తున్న తెర వెలుగు



రాత్రి పడుకునే ముందు ఫోన్ చూడటం చాలామందికి అలవాటు. అయితే తెర నుంచి వెలువడే నీలి కాంతి నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తికి ఆటంకం కలిగించవచ్చు. ఫలితంగా నిద్ర పట్టడం ఆలస్యమవుతుంది. నిద్ర నాణ్యత కూడా తగ్గుతుంది. ఈ సమస్యను నివారించేందుకు నిద్రకు కనీసం అరగంట ముందు నుంచే ఫోన్‌కు దూరంగా ఉండాలి. పడకగదిలో ఫోన్ వాడకాన్ని తగ్గించాలి.


మనసుపైనా అదృశ్య దాడి

నిరంతరం వచ్చే సమాచార హెచ్చరికలు, సామాజిక మాధ్యమాల్లో స్పందనలు, ఆదరణ కోసం ఎదురుచూపులు మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తాయి. ఇతరుల జీవితాలతో తమను పోల్చుకోవడం వల్ల ఆత్మన్యూనత, ఒంటరితనం, ఆందోళన పెరిగే అవకాశం ఉంది. ఫోన్ వినియోగానికి సమయ పరిమితి విధించుకోవాలి. ఖాళీ సమయాల్లో చిత్రలేఖనం, సంగీతం, పుస్తక పఠనం, మొక్కల పెంపకం వంటి అభిరుచులకు సమయం కేటాయించాలి.




అలవాటు నుంచి వ్యసనం వరకు..


అవసరం లేకున్నా పదేపదే ఫోన్ చూడటం, అది అందుబాటులో లేకపోతే ఆందోళన చెందడం, వాడకాన్ని నియంత్రించుకోలేకపోవడం వంటివి ఫోన్‌పై అతిగా ఆధారపడుతున్నామనే సంకేతాలు. తింటున్నా, మాట్లాడుతున్నా, ప్రయాణిస్తున్నా ఫోన్ చేతిలో ఉండాల్సిందేననే పరిస్థితి ఏర్పడుతోంది. చివరకు కుటుంబ సభ్యులతో గడిపే సమయం కూడా తగ్గిపోతోంది. ఈ అలవాటును అధిగమించేందుకు అవసరమైనప్పుడే ఫోన్ ఉపయోగించాలి. భోజనం చేసే సమయంలో, కుటుంబ సభ్యులతో మాట్లాడేటప్పుడు ఫోన్‌ను పక్కన పెట్టాలి. రోజులో కొంత సమయాన్ని ఫోన్‌కు పూర్తిగా దూరంగా గడిపేలా అలవాటు చేసుకోవాలి.ఫోన్ మన అవసరాలకు ఉపయోగపడాలి.. మన జీవితాన్ని శాసించే స్థాయికి చేరకూడదు. వినియోగంపై నియంత్రణే ఆరోగ్యకరమైన జీవనానికి తొలి అడుగు!



మెడ, భుజాలపై అదనపు భారం

ఫోన్ చూసేటప్పుడు చాలామంది తలను ముందుకు వంచి ఒకే భంగిమలో ఎక్కువసేపు ఉంటారు. ముఖ్యంగా సందేశాలు రాయడం, దృశ్యాలను వీక్షించడం వంటి పనుల్లో ఈ సమస్య ఎక్కువ. దీనివల్ల మెడ, భుజాలు, వెన్ను కండరాలపై ఒత్తిడి పెరిగి నొప్పులు వస్తాయి. దీర్ఘకాలంలో శరీర భంగిమ కూడా దెబ్బతినవచ్చు. ఫోన్‌ను కళ్లకు సమాంతరంగా ఉంచడం, మధ్యమధ్యలో లేచి నడవడం, చిన్నపాటి వ్యాయామాలు చేయడం ద్వారా ఈ సమస్యను తగ్గించుకోవచ్చు.





రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో విషాదం

- కార్మికుడి ఆత్మహత్య
- చేసిన పనికి కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వలేదని ఆరోపణలు
- ఉరేసుకొని బలవన్మరణం



ప్రజానావ, వేములవాడ: రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో కార్మికుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా చించ్‌గావ్‌కు చెందిన సంతోష్ (32) జగిత్యాల బస్టాండ్ సమీపంలోని రామతీర్థపు కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో సంతోష్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. చేసిన పనికి సంబంధించి కాంట్రాక్టర్ డబ్బులు చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

చేయూత మంజూరు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

ప్రజానావ, సిరిసిల్ల: చేయూత సామాజిక భద్రత కింద జిల్లాలో కొత్తగా పెన్షన్ల అర్హత మంజూరు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.చేయూత పెన్షన్లకు సంబంధించి కలెక్టరేట్లో మంగళవారం డీఆర్డీఓ,చేనేత జౌళి శాఖ, వైద్య ఆరోగ్య శాఖ,ఎక్సైజ్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు (తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా) గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారుల ఆధ్వర్యంలో విచారణ చేయించామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అర్హులైన వారికి నూతన పెన్షన్ మంజూరు అర్హత పత్రాలను అందజేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని స్పష్టం చేశారు.



ప్రజావాణి ఫిర్యాదుపై పాఠశాల సందర్శన

ప్రజానావ, కరీంనగర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదుపై జిల్లా అదనపు కలెక్టర్ డా. అశ్విని తనాజీ వాకాడే మంగళవారం కరీంనగర్‌లోని హుస్సేనిపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.



శాశ్వత పరిష్కారం చూపే వరకూ పోరాటం

ప్రజానావ, కరీంనగర్: కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మూడు ప్రధాన పార్టీలే బాధ్యత వహించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ విమర్శించారు.జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారాలు మారుతున్నా, నాయకులు మారుతున్నా నగర ప్రజలకు డంపింగ్ యార్డ్ సమస్య నుంచి విముక్తి కలగడం లేదన్నారు. దుర్వాసన, కాలుష్యంతో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డంపింగ్ యార్డ్ తరలింపుపై స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రీసైక్లింగ్ పేరుతో వ్యాపారాలు కాకుండా డంపింగ్ యార్డ్ తరలింపుతో శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ప్రజల ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, సమస్య పరిష్కారమయ్యే వరకు తెలంగాణ రక్షణ సేన ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

సీఎం సిద్ధిపేట సభకు జన సమీకరణ

- సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యేలు



ప్రజానావ, వేములవాడ: ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధిపేట పర్యటన నేపథ్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. సభా ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని సందర్శించి, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సిద్ధిపేట బహిరంగ సభ వేదికగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరా బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, బ్రేక్‌ఫాస్ట్ వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా సిద్ధిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా ఇందిరా కుటుంబం పథకంతో పాటు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు బోనస్, రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల ను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే, టీ పీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సభను విజయవం తం చేసేందుకు సిద్ధిపేటకు సమీపంలోని దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, సిరిసిల్ల, మానకొండూరు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. సభకు భారీగా జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని,దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది.ఈ కార్తీక మాస ఉత్సవాలు 2026 నవంబర్ 10వ తేదీ బుధవారం నుండి డిసెంబర్ 08వ తేదీ మంగళవారం వరకు కొనసాగనున్నాయి. ఈ పవిత్ర మాస వర్షదినాల సందర్భంగా ప్రతి రోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల (ముత్తైదువుల) ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహించబడుతుందని ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుహాసినులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

– ప్రజానావ, వేములవాడ



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాస మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాస ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, జపాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా ఆకాశ దీపాన్ని వెలిగించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వేద పండితులు ఏకాంతంగా నిర్వహించినట్లు ఆలయ ఏఈఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

– ప్రజానావ, వేములవాడ టౌన్

చందనోత్సవానికి బండి సంజయ్‌కు ఆహ్వానం

- 15 నుంచి 20 వరకు కొండగట్టులో ఉత్సవాలు



ప్రజానావ, కరీంనగర్: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 20 వరకు నిర్వహించనున్న చందనోత్సవం, మహా సంప్రోక్షణ ఉత్సవాలకు హాజరుకావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆహ్వానించారు. కరీంనగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, దేవస్థానం కార్యనిర్వహణాధికారి అంజనారెడ్డి, స్థానాచార్యులు కపిందర్, ఆలయ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఉప ప్రధానార్చకులు టీఎల్‌పీ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో భూముల రీ సర్వే చేపట్టాలి



ప్రజానావ, ముస్తాబాద్: భూముల వివరాలు పక్కాగా నమోదు చేసేందుకు చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను రైతుల సమక్షంలో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. ముస్తాబాద్ మండలం మొర్రాపూర్ గ్రామంలో రోవర్ యంత్రంతో చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాల సేకరణ తీరును ఆరా తీశారు. నిబంధనల ప్రకారం రోవర్ యంత్రంతో పకడ్బందీగా భూముల రీ సర్వే చేపట్టాలని, ఖచ్చితంగా రైతులకు సమాచారం అందించి, వారి సమక్షంలో ప్రక్రియ నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. భూముల వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని అన్నారు.

బహుళ పంటల సాగుపై క్షేత్ర సందర్శన



ప్రజానావ, రుద్రంగి: ఒకే భూమిలో వివిధ రకాల పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతులు సుమంత్, రాజిరెడ్డిల పంటలను రుద్రంగి మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు మిరప, పసుపు, వెల్లుల్లి, మెంతులు, పుచ్చకా య, బీరకాయ, టమాటా, ఉల్లిపాయ, పాలకూర, వేరుశనగ, మొక్కజొన్న, కొత్తిమీర తదితర పంటలను సాగు చేస్తున్న తీరును పరిశీలించి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల పంటల సాగుతో రైతులు వ్యవసాయంలో వైవిధ్యాన్ని పాటిస్తూ, ఆదాయ మార్గాలను పెంచుకునే అవకాశం ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

మంత్రి పర్యటన విజయవంతం చేయాలి: విప్

ప్రజానావ, వేములవాడ: రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, రైతును రాజుగా చూడాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోనరావుపేట మండలం నుద్దాల గ్రామంలో వ్యవసాయ గోదాం ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీరు, నాణ్యమైన విద్యుత్, నాణ్యమైన విత్తనాలు, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు..బుధవారం కొనరావుపేట మండలంలో మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం జరుగుతుందనీ తెలిపారు. గతంలో రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర లభించక ఇబ్బందులు పడుతున్న సమయంలో 2006లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.2,400కు పైగా కనీస మద్దతు ధర లభిస్తున్న నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తే రైతులు అక్కడ విక్రయించుకోవచ్చని, లేకపోతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటలు వేయండి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజానావ, గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు వైపు ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.గంభీరావుపేట మండలం రాజేశ్వర్ రావు నగర్ లో కేతు బచావో అభియాన్ ఎల్ నినో ప్రభావం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఇటీవల ఆయిల్ పామ్ మొక్కలు నాటిన పలువురు రైతులను సన్మానించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు. వరి సాగు చేస్తే నీరు భారీగా అవసరమని వెల్లడించారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పొడి ఎండ వాతావరణంతో రాను రాను రాను భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని వివరించారు. గంభీరావుపేట మండలంలో గత ఏడాది భూగర్భ జలాలు 5.96 మీటర్ల లోతులో ఉండేవని, ఈ ఏడాది 8.39 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయని తెలిపారు. దీంతో గత నెలలో విద్యుత్ వినియోగం 25 శాతం పెరిగిందని వెల్లడించారు. రైతులు మంచి ఆదాయం వచ్చే.. నీటిని తక్కువగా వినియోగించే పంటలు సాగు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ లో మొదటి మూడు ఏండ్ల అంతర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్, మొక్కలు ఇస్తామని తెలిపారు. వీటి సాగు కోసం డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు వాడి నీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్‌కు టన్ను ధర ప్రస్తుతం 22 వేల 658 ఉందని వెల్లడించారు. అలాగే జిల్లాకు దగ్గర్లోనే సిద్దిపేటలో జిల్లాలో ఆయిల్ ప్లాన్ ఫ్యాక్టరీ ఉందని వివరించారు. ఆయిల్ ఫామ్ ఉత్పత్తులు సేకరించే కేంద్రం మండలంలోనే ఉందని గుర్తు చేశారు. జిల్లాలో గత సీజన్లో అవగాహన సదస్సులు, కార్యక్రమాలతో 40 వేల ఎకరాల వరకు వరి సాగు తగ్గిందని, 700కు పైగా ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులోకి వచ్చిందని తెలిపారు. పంటల మార్పిడితో నేలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇల్లు, వ్యవసాయ క్షేత్రాల వద్ద నీటి, విద్యుత్ వృథాను అరికట్టాలని పిలుపు నిచ్చారు.

విభిన్న సాగుతో భారీ ఆదాయం

తీరొక్క ఆకుకూరలు.. కూరగాయలు సాగు చేస్తూ ముందుకు సాగుతున్నారు రైతు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్యారెడ్డి. ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో దాదాపు పది రకాలు పండిస్తూ.. వార వారం ఆదాయం పొందుతున్నారు. ఆ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించి.. రైతును అభినందించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్యారెడ్డి ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో తోట కూర, పాలకూర, చుక్క కూర, కొత్తిమీర, పూదీన, ఉలిగడ్డలు, పంకాయలు, సొరకాయ, పచ్చి మిర్చి, బీట్ రూట్, కంది సాగు చేస్తున్నారు. కోతులు, ఇతర జంతువుల నుంచి రక్షణ కోసం సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆకు కూరలు, కూరగాయల ఉత్పత్తులు వారవారం చేతికి వస్తున్నాయి. ప్రతి నెల రూ. 50 వేల వరకు ఆదాయం వస్తుందని రైతు సత్యారెడ్డి చెప్పారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్యారెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. అన్ని రకాల ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించి.. యాజమాన్య పద్ధతులు.. ఉత్పత్తి.. విక్రయం.. ఆదాయంపై ఆరా తీశారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్న రైతును అభినందించారు. మిగతా రైతులు ఆయనను ఆదర్శంగా తీసుకొని సాగు చేయాలని పిలుపునిచ్చారు.



పొగమంచు మృత్యుపాశం

- బల్గేరియాలో ఘోర రోడ్డు ప్రమాదం
- 50 వాహనాలు ఢీ.. 10 మంది మృతి, 27 మందికిపైగా గాయాలు
- ఒకదానిపై మరొకటి పడిన కార్లు, భారీ ట్రక్కులు
- సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ బృందాలు

బల్గేరియా: దట్టమైన పొగమంచు పదిమంది ప్రాణాలను బలిగొంది. కనీసం 50 వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్న ఘటనలో 10 మంది మృతిచెందగా, 27 మందికిపైగా గాయపడ్డారు. ఆగ్నేయ బల్గేరియాలోని ప్రధాన మోటార్‌వేపై మంగళవారం ఉదయం ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో కార్లు, భారీ ట్రక్కులు వరుసగా ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. కొన్ని వాహనాలు ఒకదానిపై మరొకటి పడిపోవడంతో రహదారిపై భీతావహ పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ధ్వంసమైన వాహనాల్లో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి, అంబులెన్సుల్లో సమీప ఆసుపత్రులకు తరలించారు. దట్టమైన పొగమంచు, తడిగా ఉన్న రహదారి, అతివేగం ప్రమాదానికి ప్రాథమిక కారణాలుగా అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం నేపథ్యంలో మోటార్‌వేపై ఇరువైపులా వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

చమురు ధరలకు బ్రేక్

- ట్రంప్ వ్యాఖ్యలతో మూడు నెలల కనిష్ఠానికి బ్రెంట్ క్రూడ్
- 90 డాలర్ల దిగువకు పడిపోయిన బ్యారెల్ ధర
- ఇరాన్‌పై దాడులు ఉండకపోవచ్చన్న అమెరికా అధ్యక్షుడు
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న అంచనాలు



వాషింగ్టన్: అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా దిగివచ్చాయి. ఇరాన్‌పై సైనిక దాడులు కొనసాగే అవకాశం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ చేసిన ప్రకటనతో చమురు మార్కెట్‌లో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరిగింది. దీంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల దిగువకు పడిపోయి మూడు నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం సద్దుమణిగే అవకాశాలున్నాయన్న సంకేతాలు మార్కెట్‌పై ప్రభావం చూపాయి. మంగళవారం ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 3.3 శాతం తగ్గగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ ధర 2.6 శాతం పతనమై బ్యారెల్‌కు 84.1 డాలర్ల వద్ద నమోదైంది. ఇరాన్‌తో ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న అంచనాలతో ఫ్యూచర్స్ మార్కెట్‌లో ట్రేడర్లు చమురు విక్రయాలకు మొగ్గుచూపారు. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు దిగివచ్చాయి. వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ప్రస్తుతానికి యథాతథ స్థితిని కొనసాగించాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌పై మరిన్ని దాడులు చేయాల్సిన అవసరం లేకపోవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే ఆ దేశం అణు కార్యకలాపాలకు దూరంగా ఉండేలా దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా కోరుకుంటోందని స్పష్టం చేశారు. పరిస్థితులు మారితే ఎదుర్కొనేందుకు అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. మరో సమావేశంలోనూ ఇరాన్ అణు కార్యక్రమంపై ఒప్పందం కుదిరి, హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటే ఆ దేశంపై మళ్లీ దాడులు జరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని ట్రంప్ వెల్లడించారు. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఘర్షణలు తగ్గి, చమురు సరఫరాకు ఆటంకాలు తొలగవచ్చన్న ఆశాభావం అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యక్తమవుతోంది.

చదరంగంలో భారత్ సెంచరీ

- దేశంలో 100వ గ్రాండ్‌మాస్టర్‌గా అనుజ్ శ్రీవాస్తవ
- యువతలో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనం: ప్రధాని



న్యూఢిల్లీ: చదరంగంలో భారత్ మరో అరుదైన ఘనత సాధించింది. దేశంలో గ్రాండ్‌మాస్టర్ల సంఖ్య 100కు చేరింది. మధ్యప్రదేశ్‌కు చెందిన అనుజ్ శ్రీవాస్తవ ఈ ఘనత సాధించిన 100వ భారత గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అతడికి అభినందనలు తెలిపారు. చదరంగంలో భారత్ సెంచరీ పూర్తి చేసిందని, ఇది అసాధారణ విజయమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భారత్‌లో 100 మంది గ్రాండ్‌మాస్టర్లు ఉండటం ఆటగాళ్ల ప్రతిభ, అంకితభావం, కృషికి నిదర్శనమని మోదీ అన్నారు. దేశ యువతలో చదరంగానికి ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. అనుజ్ సాధించిన విజయం మరింత మంది యువతను ఈ క్రీడ వైపు ఆకర్షించి, ఉన్నత లక్ష్యాల సాధనకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు.

ఆనంద్‌తో మొదలై.. 100కు చేరి

ఫిలిప్పీన్స్‌లోని సినకాబన్‌లో ఆదివారం ముగిసిన ఏడో ఆసియాన్ ప్లస్ వ్యక్తిగత ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడం ద్వారా అనుజ్ ఈ ఘనత సాధించాడు. దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ 1988లో భారత్ తరఫున తొలి గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించాడు. ఈ ఏడాది జులై నుంచి నవంబర్ మధ్యే భారత్‌కు ఐదుగురు కొత్త గ్రాండ్‌మాస్టర్లు లభించారు. అనుజ్‌కు ముందు ఈథన్ వాజ్, హర్ష వర్ధన్ జీబీ, ఎస్.అశ్వత్, వి.రత్నవేల్ గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించారు. భారత ఆటగాడు గుకేశ్ ప్రస్తుతం ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా కొనసాగుతున్నాడు. ఈ నెలాఖరులో తన ప్రపంచ టైటిల్‌ను కాపాడుకునేందుకు బరిలోకి దిగనున్నాడు.

ఢాకాను ఢిల్లీగా చూపిస్తూ..

చైనా వ్లాగర్ల తప్పుడు ప్రచారం

- భారత్‌పై విషప్రచారానికి మురికివాడల వీడియోల వినియోగం

న్యూఢిల్లీ: భారత్‌పై తప్పుడు ప్రచారానికి కొందరు చైనా వ్లాగర్లు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుంటున్నారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మురికివాడల దృశ్యాలను చిత్రీకరించి.. అవి దేశ రాజధాని ఢిల్లీలోని ప్రాంతాలంటూ వీడియోలు ప్రసారం చేశారు. ఈ వ్యవహారంపై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. ఇలాంటి వక్రీకరణలు దురదృష్టకరమని, తప్పుడు కథనాలతో ప్రచారం చేసేవారు తమ విశ్వసనీయతను కోల్పోతారని స్పష్టం చేసింది.

ఢాకా దృశ్యాలు.. ఢిల్లీ పేరుతో ప్రచారం

ఇటీవల కొందరు చైనా వ్లాగర్లు తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో భారత్‌లోని జీవన పరిస్థితులంటూ పలు వీడియోలు పోస్ట్ చేశారు. అయితే, వాటిలో చూపించిన దృశ్యాలు ఢిల్లీవి కాకుండా బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మురికివాడలకు సంబంధించినవిగా గుర్తించారు. ఈ విధంగా వాస్తవాలను వక్రీకరిస్తూ భారత్‌పై ప్రతికూల ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దాదాపు 150 మంది చైనా జాతీయులు వీడియోలను చిత్రీకరించినట్లు సమాచారం.

విదేశీ విమాన ప్రయాణికులు 7.87 కోట్లు

2025–26లో అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 6.1 శాతం వృద్ధి

- దేశీయ, అంతర్జాతీయంగా కలిపి 24.61 కోట్ల మంది ప్రయాణం
- విదేశీ రూట్లలో భారత విమానయాన సంస్థల వాటా తగ్గుదల

న్యూఢిల్లీ: భారత్ నుంచి విదేశాలకు విమాన ప్రయాణాలు పెరుగుతున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సంఖ్య 6.1 శాతం వృద్ధితో 7.87 కోట్లకు చేరింది. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 7.41 కోట్లుగా ఉంది. అయితే అంతర్జాతీయ ప్రయాణాల్లో భారత విమానయాన సంస్థల వాటా 45.7 శాతం నుంచి 44.4 శాతానికి తగ్గింది. విదేశీ సంస్థల వాటా 55.6 శాతంగా నమోదైంది. ఈ వివరాలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసిన 2025–26 విమానయాన గణాంకాల నివేదిక వెల్లడించింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సంఖ్య కలిపి గత ఆర్థిక సంవత్సరంలో 2.7 శాతం పెరిగి 24.61 కోట్లకు చేరింది. దేశీయ ప్రయాణికుల సంఖ్య 1.1 శాతం వృద్ధితో 16.74 కోట్లుగా నమోదైంది. 2015–16 నుంచి 2025–26 మధ్య దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య సగటున ఏటా 7 శాతం, అంతర్జాతీయంగా 4.6 శాతం చొప్పున పెరిగింది.

మధ్యప్రాచ్యానికే మొగ్గు

విదేశాలకు వెళ్లిన భారత ప్రయాణికుల్లో 51.5 శాతం మంది ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లగా, 30.4 శాతం మంది ఆసియా పసిఫిక్ ప్రాంతానికి, 13.6 శాతం మంది ఐరోపాకు ప్రయాణించారు. దేశంలో సేవలందిస్తున్న 90 షెడ్యూల్డ్ అంతర్జాతీయ విమానయాన సంస్థల్లో తొలి 10 సంస్థల వాటానే మొత్తం ప్రయాణికుల్లో దాదాపు 65 శాతంగా ఉంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి డీజీసీఏ వద్ద మొత్తం 2,218 విమానాలు నమోదయ్యాయి. వీటిలో షెడ్యూల్డ్ విమానయాన సంస్థల వద్ద 985, నాన్ షెడ్యూల్డ్ సంస్థల వద్ద 425 విమానాలు ఉన్నాయి. మిగిలినవి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, శిక్షణ కేంద్రాల వద్ద ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో దేశీయ విమాన సరుకు రవాణా 24 శాతం పెరిగి 9.78 లక్షల మెట్రిక్ టన్నులకు, అంతర్జాతీయ సరుకు రవాణా 21.3 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. దేశీయ విమానయాన రంగంలో ప్రయాణికుల డిమాండ్ అందుబాటులో ఉన్న సీట్ల సామర్థ్యం కంటే అధికంగా ఉందని నివేదిక పేర్కొంది.



హసీనాకు మరణశిక్షే గతి

- అప్పీల్ చేసుకునే గడువు ముగిసింది.. ఇక చట్టపరమైన మార్గం లేదు
- తిరిగి రావాలనుకుంటే భారత్ ద్వారా అప్పగింత కోరాలి
- మరణశిక్ష పడిన వారికి పాస్‌పోర్టు జారీకి నిబంధనలు అంగీకరించవు
- బంగ్లా ప్రభుత్వం

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్షను ఎదుర్కోవడం మినహా మరో చట్టపరమైన మార్గం లేదని ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ప్రధాన ప్రాసిక్యూటర్ మహ్మద్ అమీనుల్ ఇస్లాం స్పష్టం చేశారు. కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని హసీనా తన న్యాయ ప్రతినిధి ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విచారణ జరుగుతున్న సమయంలోనే ఆమె స్వదేశానికి తిరిగి రావాల్సిందని, లేదంటే తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా అప్పీల్ చేసుకునేందుకు బంగ్లాదేశ్‌కు వచ్చి ఉండాల్సిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా స్వదేశానికి రావాలనుకుంటే భారత్–బంగ్లాదేశ్ మధ్య ఉన్న అప్పగింత ఒప్పందం ప్రకారం తనను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేయాలని సూచించారు. మరణశిక్ష పడిన వ్యక్తులకు పాస్‌పోర్టు జారీ చేసేందుకు బంగ్లాదేశ్ చట్టాలు అనుమతించవని అమీనుల్ ఇస్లాం తెలిపారు. మరోవైపు, కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు కోసం షేక్ హసీనా దరఖాస్తు చేసుకున్నారంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని బంగ్లాదేశ్ ప్రధాని సలహాదారు జాహెద్ ఉర్ రహమాన్ స్పష్టం చేశారు.



వర్షార్పణం

- వర్షంతో రద్దయిన మూడో వన్డే
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2–0 ఆధిక్యం

హామిల్టన్: భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో వన్డేకు వర్షం అడ్డంకిగా మారింది. హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్ వేదికగా మంగళవారం జరగాల్సిన మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2–0 ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. చివరి రెండు వన్డేలు నవంబర్ 13, 15 తేదీల్లో టౌరంగాలో జరగనున్నాయి. వరుసగా మూడోసారి టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన జట్టునే కొనసాగించాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించి నిర్వహించేందుకు మైదానాన్ని సిద్ధం చేస్తున్న సమయంలో మరోసారి వాన మొదలైంది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7.50 గంటలకు 20 ఓవర్ల మ్యాచ్ నిర్వహించేందుకు గడువు ముగియడానికి కనీసం 70 నిమిషాల ముందే అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రోజంతా వర్షం కురిసే అవకాశం 90 శాతంగా ఉండటంతో ముందుగానే వాతావరణంపై ఆందోళనలు నెలకొన్నాయి.

చివరి రెండు మ్యాచ్‌లకు గిల్ దూరం

ఈ మ్యాచ్ తర్వాత కెప్టెన్ గిల్, సీనియర్ వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ టెస్టు జట్టుతో కలిసి వెల్లింగ్టన్‌కు వెళ్లాల్సి ఉంది. వారితో పాటు కుల్దీప్ యాదవ్, అన్షుల్ కాంబోజ్, మహమ్మద్ సిరాజ్ కూడా టెస్టు జట్టులో చేరనున్నారు. గిల్ గైర్హాజరీలో చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్ తుది జట్టులో చోటు దక్కించుకునే అవకాశముంది.





ఆర్యవీర్ విధ్వంసం.. సెమీస్‌కు భారత్

- యూఏఈపై 70 పరుగుల తేడాతో ఘన విజయం
- 160 పరుగులతో చెలరేగిన సెహ్వాగ్ తనయుడు
- యూత్ వన్డేల్లో ఆర్యవీర్‌కు తొలి శతకం
- గురువారం అఫ్గానిస్థాన్‌తో సెమీఫైనల్ పోరు

అల్ అమరాత్: మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ బ్యాట్‌తో మెరుపులు మెరిపించడంతో అండర్–19 ఆసియా కప్‌లో భారత జట్టు సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. యూఏఈతో మంగళవారం జరిగిన కీలక పోరులో భారత్ 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆర్యవీర్ 160 పరుగులతో అద్భుతంగా రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. యూత్ వన్డేల్లో అతడికిదే తొలి శతకం కావడం విశేషం. ఈ విజయంతో సెమీస్ బెర్తు ఖరారు చేసుకున్న భారత్.. గురువారం అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది.

తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో..

పాకిస్థాన్ చేతిలో ఓటమి తర్వాత సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే యూఏఈపై గెలవాల్సిన మ్యాచ్‌లో భారత బ్యాటర్లు సమష్టిగా రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. ఆర్యవీర్ ఆరంభంలో ఆచితూచి ఆడినా.. క్రీజులో కుదురుకున్నాక ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తొలి పరుగు కోసం 14 బంతులు తీసుకున్న అతడు.. 69 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత దూకుడు పెంచి 131 బంతుల్లో శతకాన్ని అందుకున్నాడు. అనంతరం కేవలం 37 బంతుల్లోనే మరో 60 పరుగులు జోడించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. 150 పరుగుల మైలురాయిని సిక్సర్‌తో చేరుకున్న ఆర్యవీర్.. చివరకు నసీమ్ ఖాన్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మొత్తంగా 168 బంతుల్లో 17 ఫోర్లు, 7 సిక్సర్లతో 160 పరుగులు సాధించాడు.

వినీత్ అండ

ఆర్యవీర్‌కు తోడుగా వి.కె. వినీత్ (67; 69 బంతుల్లో) అర్ధశతకంతో రాణించాడు. అన్వయ్ ద్రవిడ్ 9 బంతుల్లో 12 పరుగులు చేశాడు. అనంతరం 310 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కోలేకపోయింది. అహ్మద్ ఖుదాబాద్ (74; 74 బంతుల్లో) పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. నిర్ణీత 50 ఓవర్లలో 239 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్ 70 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుని సెమీఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది.



మళ్లీ క్రికెట్‌పై ప్రేమ పుట్టింది

- ప్రపంచకప్ గెలిచినా జట్టులో చోటు కోల్పోవడం బాధించింది
- కష్టకాలం నుంచి బయటపడ్డా.. మళ్లీ ఆటపైనే దృష్టి
- ముంబైని చాంపియన్‌గా నిలపడమే లక్ష్యం: టీమిండియా మాజీ కెప్టెన్ సూర్యకుమార్



ముంబై: టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టుకు నాయకత్వం వహించినా.. ఆ తర్వాత భారత జట్టులో చోటు కోల్పోవడం తనను తీవ్రంగా బాధించిందని టీమిండియా మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. అయితే కష్టకాలం నుంచి బయటపడి మళ్లీ క్రికెట్‌పై ప్రేమ, అభిరుచిని పెంచుకున్నానని తెలిపాడు. ప్రస్తుతం తన దృష్టంతా ఆటపైనే ఉందని పేర్కొన్నాడు. 2026 మార్చి 8న న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ 96 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో సూర్యకుమార్ తొలి బంతికే ఔటయ్యాడు. వరుసగా తక్కువ స్కోర్లతో నిరాశపరిచిన అతడు ఆ తర్వాత జట్టులో చోటు కోల్పోయాడు. ఈ పరిణామం తనను తీవ్రంగా కలచివేసిందని చెప్పాడు. మే నెలలో కుమార్తె జన్మించడంతో తన దృష్టి కుటుంబంపైకి మళ్లిందని, ఆ తర్వాత క్రమంగా ఆటపై మళ్లీ ఆసక్తి పెరిగిందని వివరించాడు.

15 ఏళ్ల వయసులో ఉన్న పట్టుదలతో..

తన భార్య దేవిషా శెట్టి ఇచ్చిన సలహా తనలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని సూర్య తెలిపాడు. 15 ఏళ్ల వయసులో ముంబై అండర్–15 జట్టుకు ఆడాలని కలలు కన్న రోజుల్లో ఉన్న ప్రేమ, పట్టుదలతో మళ్లీ సాధన చేస్తున్నానని చెప్పాడు. త్వరలో జరిగే సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై జట్టుకు నాయకత్వం వహించనున్నట్లు వెల్లడించాడు. యువ క్రికెటర్లు ఐపీఎల్‌లో చోటు సంపాదించడాన్నే అంతిమ లక్ష్యంగా భావించకూడదని సూర్య సూచించాడు. తొలుత ముంబై వయో విభాగాల జట్లకు, ఆ తర్వాత ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించాలని, చివరికి భారత్ తరఫున ఆడాలనే కలతో ముందుకు సాగాలని హితవు పలికాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తే గుర్తింపు, అవకాశాలు వాటంతట అవే వస్తాయని పేర్కొన్నాడు. ఇటీవల జరిగిన రంజీ ట్రోఫీ తొలి విడతకు తనను ఎంపిక చేయకపోవడంపై సూర్య అసంతృప్తి వ్యక్తం చేశాడు. అయినప్పటికీ ముస్తాక్ అలీ టోర్నీలో ముంబైని విజయపథంలో నడిపించడమే తన ముందున్న లక్ష్యమని స్పష్టం చేశాడు.

రొనాల్డో రికార్డుపై ముగ్గురి గురి

- అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 146 గోల్స్‌తో అగ్రస్థానంలో పోర్చుగల్ స్టార్
- ఛేదనలో హ్యారీ కేన్, ఎంబాపె, హాలాండ్
- నేషన్స్ లీగ్ పోరులకు సిద్ధమైన అగ్రశ్రేణి జట్లు
- క్వార్టర్ బెర్తులే లక్ష్యంగా సమరానికి సై







లండన్: అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో క్రిస్టియానో రొనాల్డో నెలకొల్పిన అత్యధిక గోల్స్ రికార్డును అధిగమించడంపై కొత్త తరం స్ట్రైకర్లు దృష్టి సారించారు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్, ఫ్రాన్స్ స్టార్ కైలియన్ ఎంబాపె, నార్వే సంచలనం ఎర్లింగ్ హాలాండ్ ఈ జాబితాలో ముందున్నారు. రొనాల్డో 146 అంతర్జాతీయ గోల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. కేన్ 91, ఎంబాపె 67, హాలాండ్ 65 గోల్స్‌తో అతడి రికార్డును అందుకునే దిశగా సాగుతున్నారు. ప్రస్తుతం నేషన్స్ లీగ్ మ్యాచ్‌లకు సిద్ధమవుతున్న ఈ ముగ్గురికీ గోల్స్ సాధించేందుకు మరో అవకాశం రానుంది. పోర్చుగల్ తరఫున 23ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లో రొనాల్డో 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ చేశాడు. ఈ రికార్డును అధిగమించడం ప్రస్తుత ఆటగాళ్లకు పెద్ద సవాలే. గురువారం క్రొయేషియాతో జరిగే మ్యాచ్‌లో బరిలోకి దిగితే ఇంగ్లండ్ తరఫున 126 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా హ్యారీ కేన్ మరో ఘనత సాధించనున్నాడు. ఆదివారం స్పెయిన్‌తో ఇంగ్లండ్ తలపడనుంది. వరుసగా 42 మ్యాచ్‌లుగా ఓటమి ఎరుగని స్పెయిన్‌కు ఈ పోరు కీలకం కానుంది. మరోవైపు గురువారం ఇటలీతో ఫ్రాన్స్ తలపడనుండగా.. హాలాండ్ సారథ్యంలోని నార్వే జట్టు వేల్స్, డెన్మార్క్‌లతో పోటీపడనుంది. నేషన్స్ లీగ్‌లో నాలుగు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు వచ్చే ఏడాది మార్చిలో జరిగే క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. జూన్‌లో సెమీఫైనల్స్, ఫైనల్ నిర్వహించనున్నారు. ఇదే సమయంలో 2028 యూరో కప్ అర్హత పోటీల గ్రూపుల డ్రాకు సంబంధించి జట్ల సీడింగ్ కూడా ఖరారు కానుంది.

ఆసియా అథ్లెటిక్స్ వేదికగా చెన్నై

- 2029 ఛాంపియన్‌షిప్స్ నిర్వహణకు లైన్ క్లియర్
- ప్రభుత్వ హామీల సమర్పణ తర్వాత అధికారిక ప్రకటన

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణలో భారత్‌కు మరో అవకాశం దక్కనుంది. 2029 ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు తమిళనాడు రాజధాని చెన్నై ఆతిథ్యమిచ్చే అవకాశాలు దాదాపు ఖరారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, ఇతర నిర్వహణపరమైన హామీలను సమర్పించిన వెంటనే చెన్నైని వేదికగా అధికారికంగా ప్రకటించనున్నట్లు ఆసియా అథ్లెటిక్స్ సంఘం (ఏఏఏ) వెల్లడించింది. మంగళవారం టోక్యోలో జరిగిన సంఘం కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధి లత తెలిపారు. బుధవారం ప్రభుత్వ హామీల పత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 2029లో జరగనున్నది ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ 28వ ఎడిషన్. ఈ పోటీలకు భారత్ ఆతిథ్యమివ్వడం ఇది మూడోసారి కానుంది. గతంలో 2013లో పుణె, 2017లో భువనేశ్వర్‌లో ఈ ఛాంపియన్‌షిప్స్ నిర్వహించారు. 27వ ఎడిషన్ 2027 మే 28 నుంచి జూన్ 2 వరకు చైనాలోని జియామెన్‌లో జరగనుంది.

భారీ ఈవెంట్లకు సన్నాహాలు

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు భారత్ వరుసగా అవకాశాలు దక్కించుకుంటోంది. వచ్చే ఏడాది ఆగస్టులో చండీగఢ్‌లో ఆసియా రిలేస్ ఛాంపియన్‌షిప్స్ జరగనున్నాయి. 2028లో భువనేశ్వర్ ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌తో పాటు ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు వేదిక కానుంది. అదే ఏడాది అహ్మదాబాద్‌లో అండర్–20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ నిర్వహించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది.



కొక్కొరొకో సీను, పార్వతిల లవ్ గ్లింప్స్

టాలీవుడ్‌లో సరికొత్త కథాంశాలతో సినిమాలు తెరకెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో విభిన్నమైన కథనంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న చిత్రం 'కొక్కొరొకో'. తాజాగా ఈ సినిమా నుంచి చిత్ర బృందం విడుదల చేసిన లవ్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'కొక్కొరొకో ప్రపంచం నుంచి సీను, పార్వతిల ప్రేమకథను చూడండి' అంటూ విడుదల చేసిన ఈ వీడియోలో ప్రేమ, అనుబంధం, భావోద్వేగాలకు పెద్దపీట వేశారు. ఇద్దరి మధ్య సాగే ప్రేమ ప్రయాణాన్ని అందమైన దృశ్యాలతో ఆవిష్కరించారు. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరుగుతోంది. దర్శకుడు శ్రీనివాస్ వసంతాల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, ప్రముఖ దర్శకుడు రమేష్ వర్మ తన ఆర్వీ ఫిల్మ్ హౌస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేను కూడా ఆయనే అందిస్తున్నారు. ఐదు విభిన్న పాత్రల చుట్టూ సాగే కథలను అంథాలజీ రూపంలో రూపొందిస్తున్నారు. సంప్రదాయ కోడిపందాల నేపథ్యాన్ని కథాంశంగా ఎంచుకోవడం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సముద్రఖని, చైతన్య రావు, గోపికా ఉద్యన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంకీర్తన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా నుంచి విడుదలవుతున్న ప్రచార చిత్రాలు అంచనాలను పెంచుతున్నాయి. తాజాగా వచ్చిన లవ్ గ్లింప్స్ సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.



కాలం కంటే ముందే..
యంగ్ లుక్‌లో కమల్

విభిన్న పాత్రలు, ప్రయోగాత్మక చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విలక్షణ నటుడు కమల్ హాసన్ మరోసారి అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'సండియార్' చిత్రం నుంచి తాజాగా విడుదల చేసిన కొత్త లుక్ సోషల్ మీడియాలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంతకుముందు నెరిసిన గడ్డం, జుట్టుతో పూర్తిగా మాస్ అవతార్‌లో కనిపించి ఆకట్టుకున్న కమల్.. తాజా పోస్టర్‌లో మాత్రం యువకుడిలా దర్శనమిచ్చారు. 'ప్రతి యుగానికి అతీతంగా.. ఎప్పుడూ కాలం కంటే ముందే' అనే క్యాప్షన్‌తో ఈ లుక్‌ను పంచుకోవడం విశేషం.

ఆ పిల్లుపు ఎప్పటికీ గుర్తుంటుంది

సినీ ప్రయాణంలో ఎదురయ్యే కొన్ని పరిచయాలు, అవకాశాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. అలాంటి ఓ మధురమైన అనుభవాన్ని నటి శ్రీలీల తాజాగా పంచుకున్నారు. తన కెరీర్ ప్రారంభంలోనే ప్రముఖ నటుడు, దర్శకుడు ధనుష్ నుంచి ఫోన్ కాల్ రావడం ప్రత్యేకమైన విషయమని వెల్లడించారు. ప్రస్తుతం ధనుష్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఓమ్' చిత్రంలో శ్రీలీల కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటోంది. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన శ్రీలీల.. తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తొలినాళ్లలో తనకు వచ్చిన తొలి పెద్ద ఫోన్ కాల్ ధనుష్ నుంచేనని గుర్తుచేసుకున్నారు. ఆయనకు తాను వీరాభిమానినని, భారతీయ సినిమాలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అలాంటి నటుడితో కలిసి పనిచేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు.



బిజినెస్ BUSINESS

డిటర్జెంట్ల ధరలకు రెక్కలు!

- సర్ఫ్ ఎక్సెల్, రిన్, వీల్‌పై 11 శాతం వరకు పెంపు
- ప్యాక్‌ను బట్టి రూ.1–10 వరకు ధరల సవరణ



న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థ హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) వినియోగదారులకు ధరల షాక్ ఇచ్చింది. ముడి సరుకుల వ్యయాలు పెరగడంతో సర్ఫ్ ఎక్సెల్, రిన్, వీల్ డిటర్జెంట్ పౌడర్లు, బార్ల ధరలను గరిష్ఠంగా 11 శాతం వరకు పెంచింది. ప్యాక్ పరిమాణాన్ని బట్టి రూ.1 నుంచి రూ.10 వరకు ధరలు సవరించింది. సర్ఫ్ ఎక్సెల్ క్విక్ వాష్ కిలో ప్యాక్ ధర రూ.235 నుంచి రూ.245కు, 500 గ్రాముల ప్యాక్ ధర రూ.123 నుంచి రూ.128కు పెరిగింది. 150 గ్రాముల సబ్బు ధర రూ.74 నుంచి రూ.82కు చేరింది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలను అధిగమించి లాభాల మార్జిన్లను కాపాడుకునేందుకే కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది.



ఢిల్లీలో భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో

- ఫిబ్రవరి 4 నుంచి 9 వరకు ప్రదర్శన
- హాజరు కానున్న1,750కి పైగా సంస్థలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆటోమొబైల్ రంగానికి వేదికగా నిలవనున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో–2027 వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 9 వరకు ఢిల్లీలో జరగనుంది. ఈ మెగా ప్రదర్శనలో 50కి పైగా దేశాలు, 1,750కి పైగా సంస్థలు పాల్గొననున్నాయి. అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ సహా పలు దేశాలు ఇందులో భాగస్వాములు కానున్నాయి. ఎక్స్‌పోలో భాగంగా నిర్వహించే ఆటో ఎక్స్‌పో–ది మోటార్ షోలో 44 వాహన తయారీ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. ఎలక్ట్రిక్, సీఎన్‌జీ, ఎల్‌ఎన్‌జీ, ఇథనాల్, ఫ్లెక్స్ ఫ్యూయల్, హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన సాంకేతికతలతో రూపొందించిన వాహనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. 'స్మార్టర్ మొబిలిటీ ఫర్ ఎ బెటర్ టుమారో' ఇతివృత్తంతో భారత్ మండపం, యశోభూమి వేదికలపై ఈ కార్యక్రమం జరగనుంది. మొత్తం 2.5 లక్షల చదరపు అడుగుల ప్రదర్శన స్థలంలో 11 విభాగాలకు చెందిన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి 10 లక్షల మందికి పైగా సందర్శకులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

ప్రపంచ మొబిలిటీ హబ్‌గా భారత్

ప్రపంచ మొబిలిటీ రంగంలో భారత్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో–2027 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 9 వరకు ఢిల్లీలోని భారత్ మండపం, యశోభూమి వేదికలపై ఈ ప్రదర్శన జరగనుంది. మూడో విడతగా నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పో ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ మొబిలిటీ ప్రదర్శనల్లో ఒకటిగా నిలవనుంది. ప్రపంచ మొబిలిటీ హబ్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ఈ కార్యక్రమం చాటిచెప్పనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ అవకాశాలకే పరిమితం కాకుండా అంతర్జాతీయ ఎగుమతి మార్కెట్లలోనూ భారత ఆటోమొబైల్ పరిశ్రమ విస్తరించాలని సూచించారు. భారతీయ ప్రతిభ, నైపుణ్యాలు, ఆవిష్కరణలు, తయారీ సామర్థ్యంతో ప్రపంచ స్థాయి మొబిలిటీ పరిష్కారాలను అందించే సత్తా దేశానికి ఉందని పేర్కొన్నారు.

పసిడి ధరకు డాలర్ దెబ్బ

- 10 గ్రాముల బంగారంపై రూ.500 తగ్గుదల
- ఢిల్లీలో రూ.1,46,400కు చేరిన ధర
- రెండో రోజూ స్థిరంగా వెండి.. కిలో రూ.1,92,500
- అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై మదుపర్ల చూపు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రతికూల పరిణామాలు, అమెరికా డాలర్ బలోపేతం కావడంతో దేశీయంగా బంగారం ధరలు దిగివచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి ధర మంగళవారం రూ.500 తగ్గి రూ. 1,46,400కు చేరింది. అంతకుముందు రోజు ఈ ధర రూ. 1,46,900గా నమోదైంది. మరోవైపు వెండి ధరలో మాత్రం ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. వరుసగా రెండో రోజూ కిలో వెండి రూ. 1,92,500 వద్ద స్థిరంగా కొనసాగింది. ప్రపంచ మార్కెట్‌లోనూ పసిడి, వెండి ధరలు నేలచూపులు చూశాయి. ఔన్సు బంగారం ధర 27.59 డాలర్లు (దాదాపు ఒక శాతం) తగ్గి 4,113.55 డాలర్లకు పడిపోయింది. వెండి ధర సైతం ఒక శాతానికిపైగా క్షీణించి 52.77 డాలర్లకు చేరింది. దేశీయంగా దీపావళి సమయంలోనూ బంగారం కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం ధరలపై ఒత్తిడిని పెంచిందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

ఫెడ్ నిర్ణయంపై ఉత్కంఠ

ముడిచమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణ భయాలు కొంతమేర తగ్గినప్పటికీ, డాలర్ విలువలో చోటుచేసుకుంటున్న మార్పులు పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర మూడు శాతానికి పైగా తగ్గి బ్యారెల్‌కు 89.85 డాలర్లకు చేరింది. మరోవైపు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ గణాంకాల ఆధారంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న అంశం బంగారం ధరల తదుపరి కదలికలను ప్రభావితం చేయనుంది.

ఒక్కరోజే 91.69 కోట్ల లావాదేవీలు

- దీపావళి వేళ యూపీఐ చెల్లింపుల జోరు
- గతేడాదితో పోలిస్తే 32 శాతం పెరుగుదల
- రూ.90 వేల కోట్లకు పైగా నగదు బదిలీ



న్యూఢిల్లీ: దీపావళి పండుగ సంద ర్భంగా దేశంలో డిజిటల్ చెల్లింపులు భారీగా పెరిగాయి. యూ పీఐ లావాదేవీల సంఖ్య గతేడాదితో పోలిస్తే 32 శాతం వృద్ధి చెందింది. ఈ నెల 8న దీపావళి రో జున 91.69 కోట్ల లావాదేవీలు జరగ్గా, వీటి విలువ రూ.90,029.43 కోట్లుగా నమోదైంది. గతేడాది దీపావళి రోజున 69.57 కోట్ల లావాదే వీల ద్వారా రూ.88,350.79 కోట్ల చెల్లింపులు జరిగాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన గణాంకా ల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. దీపావళికి ముందు రోజైన నవంబర్ 7న యూపీఐ లావా దేవీలు 97.58 కోట్లకు చేరాయి. వీటి ద్వారా ఏకంగా రూ.1.36 లక్షల కోట్ల నగదు బదిలీ జరిగింది. అక్టోబర్ నెలలోనూ పండుగ కొనుగోళ్ల ప్రభావంతో 2,547 కోట్ల యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయి. వీటి మొత్తం విలువ రూ. 31.53 లక్షల కోట్లుగా ఉంది. భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలక మార్పులు తీసుకొచ్చిన యూపీఐ సేవలు ప్రస్తు తం 11 దేశాల్లో అందుబాటులో ఉన్నాయి. తా జాగా ఉజ్బెకిస్థాన్ ఈ జాబితాలో చేరింది. సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, మారిషస్, నేపాల్, భూటాన్, ఖతార్, శ్రీలంక, కంబోడియా, గ్రీన్ దేశాల్లోనూ యూపీఐ చెల్లింపులకు అవకాశం ఉంది. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన యూ పీఐ లావాదేవీల విలువ 2016–17లో రూ. 0.07 లక్షల కోట్ల నుంచి 2025–26లో సుమారు రూ.314 లక్షల కోట్లకు పెరిగింది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.